ప్రజాశక్తి
శనివారం 11 ఫిబ్రవరి 2023 5 అనంతపురం





విలేకరులతో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

వేడెక్కుతున్న రాజకీయాలు



◆ మండలి ఎన్నికలకు మొదలైన కసరత్తు
◆ ప్రధాన అభ్యర్థులు బరిలో దిగేందుకు సమాయత్తం
◆ అమల్లోకి ఎన్నికల నియమావళి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాయలసీమ పశ్చిమ నియోజవర్గం పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవనుండటంతో రాజకీయ వేడి మొదలైంది. ప్రధాన అభ్యర్థులందరూ రంగంలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. పట్టభద్రుల నియోజకవర్గానికి ప్రధానంగా త్రిముఖపోరు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గానికి త్రిముఖపోరే నడిచింది. ఈ నియోజకవర్గం పరిదిలో ముందు నుంచి అదే రకమైన పోరు సాగుతూ వస్తోంది. వైసిపి, టిడిపితోపాటు, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్య ముఖ్య పోటి ఉండనుంది. అంతకు మునుపు ఎన్నికల్లోనూ అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీ, పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ గేయానంద్ మధ్య పోటీ సాగింది. ఈ ఎన్నికలో డాక్టర్ గేయానంద్ విజయం సాధించారు. ఆ తరువాత గత ఎన్నికల్లో వైసిపి, టిడిపి, పిడిఎఫ్ మధ్యనే ప్రధాన పోటీ సాగింది. అయితే ఈ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి వెన్నపూస గోపాల్‌రెడ్డి విజయం సాధించారు. టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ గేయానంద్‌లు వరుస స్థానాల్లో నిలిచారు. ఇప్పుడు జరుగుతున్న ఈ ఎన్నికల్లోనూ అధికార వైసిపి, పిడిఎఫ్; టిడిపి అభ్యర్థు మధ్యనే పోటీ తీవ్రంగా ఉండే అవకాశముంది. అధికార వైసిపిలో వెన్నపూస గోపాల్‌రెడ్డి కాకుండా ఆయన కుమారుడు వెన్నపూస రవీంద్రరెడ్డి బరిలో నిలిచారు. పార్టీ కూడా ఆయన పేరు ఖరారు చేయడమే కాకుండా ఆయన్ను గెలపించాలని కోరుతూ రీజనల్ ఇన్‌ఛార్జీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాలో నియోజకవర్గాల సమావేశాలు పెట్టారు. పిడిఎఫ్ అభ్యర్థిగా పోతుల నాగరాజు బరిలో నిలుస్తున్నారు. సామాజిక ఉద్యమాల్లో ముందు నుంచి పాల్గొంటున్న ఈయనకు పిడిఎఫ్ అభ్యర్థిగా ప్రకటించి వామపక్షాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. ఈయన విజయానికి కృషి చేయాలని నిర్ణయించారు తద్వారా అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీలకు ప్రత్యామ్నాయం ప్రజలు కోరుకుంటున్నారని చాటిచెప్పాలన్న కృతనిశ్చయంతోనున్నారు. ఇక టిడిపి కూడా ప్రభుత్వ వ్యతిరేకతపై నమ్మకం పెట్టుకుని రాంభూపాల్‌రెడ్డిని బరిలోకి దింపింది. ఓటర్ల నమోదు సమయంలోనూ ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రధానంగా ఈ ముగ్గురి మధ్యనే త్రిముఖపోరు ఈ ఎన్నికల్లో జరిగే అవకాశాలున్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఉపాధ్యాయ స్థానంలోనూ పోటీ..

ఉపాధ్యాయ నియోజకవర్గానికి చూసినప్పుడు ఇప్పుడున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మరోమారు పిడిఎఫ్ ఎమ్మెల్సీగా బరిలో దిగుతున్నారు. ప్రజా సంఘాల మద్దతు ఈయనకు గతంలో లాగానే ఉంది. ఇతరులకు కత్తి నరసింహారెడ్డికున్న స్థాయిలో మద్దతు కనిపించడం లేదు. ప్రధాన పోటీలో ఆయనే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ మేరకు ఇప్పటికే ఉపాధ్యాయులు వారి మద్దతును బహిర్గత పరుస్తున్నారు.

అమల్లోకి ఎన్నికల నియమావళి : కలెక్టర్



మండలి ఎన్నికలకు షెడ్యూల్ వెలువడటంతో ఎన్నికల నియామావళి అమల్లోకి వచ్చిందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపింది. శుక్రవారం నాడు రెవెన్యూ భవనంలో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల నియమావళి గురించి తెలియజేశారు. 21 మంది నోడల్ అధికారులను నియమించినట్టు, వారికి అందజేసిన హ్యాండ్ బుక్‌ను స్పష్టంగా చదువుకుని దాన్ని అమలు చేయాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ తదితర అంశాలపై సిబ్బందికి శిక్షణనివ్వాలని తెలిపారు. ఎన్నికల నియమావళి పక్కగా అమలు జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ అప్పజెప్పిన పనులను తూచా తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. పోలింగ్, కౌంటింగ్‌లకు విడివిడిగా శిక్షణనివ్వాలని సూచించారు.

అదానీ కబంద హస్తాల్లో అనంత

◆ అప్పనంగా వేలాది ఎకరాలు దారాదత్తం
◆ రైతులకు లీజు చెల్లింపు బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల వ్యవసాయ భూములను అప్పనంగా అప్పగించి జిల్లా, రైతులను అదానీ కబంధహస్తాల్లోకి తీసుకెళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలియజేశారు. శుక్రవారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదానీ కంపెనీపై ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక ఆరోపణలు వెల్లువెత్తుతున్న పరిస్థితుల్లో జిల్లాలో 406 ఎకరాల భూమిని ఆ కంపెనీకి ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో తీర్మానం చేయడం సరికాదన్నారు. అదానీ గ్రీన్ ఎనర్జీ ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడం కోసం జిల్లాలోని డి.హీరేహాల్ మండలంలో 6 వేల ఎకాలు, కణేకల్ 2,711 వేలు, బొమ్మనహాల్‌లో 1,343 ఎకరాలు, రాయదుర్గం 1,117 ఎకరాలు మొత్తం 11,831 ఎకరాల భూమిని సేకరిస్తున్నారని తెలిపారు. మరో 3 వేల ఎకరాల కోసం సర్వేలు చేస్తున్నారని తెలిపారు. నాలుగు మండలాల్లోని 13 గ్రామాల్లో కలిపి 15 వేల ఎకరాల భూమిని ఒకే చోట కలిసే జంక్షన్‌లో ఈ సోలార్ ప్లాంట్ పెడుతున్నారని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో ముదిగుబ్బ మండలంలో 20 వేల ఎకరాలు, కనగానిపల్లిలో 7 వేల ఎకరాలు సేకరిస్తున్నారని తెలిపారు. కంబదూరు, రాళ్ల అనంతపురంలో 45 వేల ఎకరాలు, శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి, తలుపుల, ఓడిసి, ఓబులదేవచెరువు మండలల్లో 64 వేల ఎకరాలు భూమిని సేకరిస్తున్నారని తెలిపారు. అదానీ కంపెనీ భూములను అద్దె పద్ధతిలో సేకరిస్తుండటం, అద్దె చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోక పోవడంపై రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. లీజు పద్ధతి ద్వారా రైతులను మభ్యపెట్టి చట్టాలను తుంగలో తొక్కి వేల ఎకరాల భూములు సేకరిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సిద్ధమైన ఎండ నుంచి విద్యుత్ ఉత్పత్తిని సేకరించడాన్ని తాము స్వాగతిస్తామన్నారు. అయితే విస్తారంగా ఉన్న భూములను వ్యవసాయ సాగుకు కాకుండా ఇలా విద్యుత్ ఉత్పత్తి పేరుతో అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడంలో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. 30 ఏళ్ల పాటు కంపెనీ విద్యుత్ ఉత్పత్తి నిర్వహిస్తుందో లేదో గ్యారంటీ లేదన్నారు. ఒకవేళ కంపెనీ కుదేలైతే ఆ భూములను అధికార పార్టీ స్వాహా చేసుకోవచ్చన్న ముందస్తు ప్రణాళికలు చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వమే రైతులకు అద్దె చెల్లించే బాధ్యత తీసుకోవాలన్నారు. అలా కాదని భూములు సేకరిస్తామంటే సరికాదన్నారు. రైతులకు ఎకరాకు నెలకు రూ.30వేలు లీజు ఇవ్వాలన్నారు. రైతుల ఆందోళనలను నివృత్తి చేసిన తరువాతను కంపెనీ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య, ఓ.నల్లప్ప, ఎస్.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ కల్యాణమస్తు నగదు జమ

309 మందికి లబ్ధి



లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా లబ్ధిదారులకు సాంఘిక సంక్షేమ ఆధ్వర్యంలో చెక్కు అందజేశారు. అక్టోబరు-డిసెంబరు-2022 త్రైమాసికానికి సంబంధించి జిల్లాలో మొత్తం 309 దంపతులకు రూ.2,48,55,000 నగదును అందజేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్ రెడ్డి మాట్లాడుతూ మూడు నెలలకోసారి కళ్యాణమస్తు-షాదీ తోఫా లబ్ధిదారులను ఎంపిక చేసి నగదు అందిస్తామన్నారు. నూతన వధూవరులు వివాహం అయిన 30 రోజుల్లోపు స్థానిక గ్రామ,వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంత డిప్యూటీ మేయర్ కోగటం విజయ్ భాస్కర్ రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ రీజనల్ ఛైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, గ్రంథాలయ ఛైర్‌పర్సన్ ఉమాదేవి, కళ్యాణమస్తు-షాదీ తోఫా పొందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

అనంత జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురము జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బి.టెక్ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.19) రెగ్యులర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఇ.కేశవరెడ్డి తెలిపారు. వీటితోపాటు బి.టెక్ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.15) సప్లిమెంటరీ ఫలితాలు, ఎం.ఫార్మసీ 4వ సెమిస్టర్ (ఆర్.17) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష పలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫలితాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.21.60 కోట్లు మంజూరు

రాయదుర్గం : నియోజకవర్గం పరిధిలోని గ్రామీణ రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.21.60 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు విప్ కాపు రామచంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో ఉన్న వివిధ గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన రహదారులను అనుసంధానం చేస్తూ నూతన రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇందుకు పంచాయతీరాజ్ విభాగం తరపున కొత్త రహదారుల నిర్మాణానికి జీవో 59 మేరకు సిఎం జగన్ ప్రత్యేక చొరవతో రూ.21.60 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేయించడం పట్ల ముఖ్యమంత్రికి నియోజకవర్గ ప్రజల తరపున అభినందనలు తెలిపారు.

నేడు రైల్వేసేఫ్టీ కమిషనర్ రాక

రాయదుర్గం : దక్షిణ భారత వలయం రైల్వే సేఫ్టీ కమిషనర్ శనివారం రానున్నట్లు బెంగళూరు కంటోన్మెంట్ నిర్మాణపు విభాగం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శుక్రవారం ఒక ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తుమకూరు రైలు మార్గ నిర్మాణంలో భాగంగా అనంతపురం జిల్లాలోని కదిరిదేవరపల్లి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు జిల్లా దొడ్డహళ్లి (పెద్దపల్లి) వరకు 20 కిలోమీటర్ల రైలు మార్గం నిర్మాణ పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక రైలులో గంటకు 120 కిలోమీటర్ల వేగంతో మార్గం రక్షణ సామర్థ్యాన్ని పరీక్షించనున్నట్లు తెలిపారు.

ఎల్ఐసి కార్యాలయం ఎదుట నిరసన

రాయదుర్గం : కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం ఎదుట సిపిఐ రాయదుర్గం తాలూకా కార్యదర్శి ఎం.నాగార్జున ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులు, నల్ల కుబేరులు, ఆదానికి కట్టబెడుతోందన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను అమాంతంగా పెంచేసి ప్రజలపై భారం వేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం కొనసాగిస్తామన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు వేతనాలు, అరియర్స్ చెల్లింపులు జాప్యం జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థులపై శ్వేతపత్రం విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్యలు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగులకు ఒకటిన్నర సంవత్సరాలుగా చెల్లించాల్సిన పిఎఫ్, ఏపిజిఎల్ఎస్ఐ, డిఏలు, సరండర్ లీవులు సహా అనేక అరియర్లు సుమారు రూ. 3 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిందన్నారు. వాటిని కనీసం కొంతమేరకైనా చెల్లింపు చేయకపోగా వేతనాలు సైతం ఒకటవ తేదీకి చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. నెలలో 10వ తేదీ వచ్చినా ఇప్పటి వరకు కేవలం 30 శాతం మందికి మాత్రమే వేతనాలు అందాయని, ఇంకా 70 శాతం మందికి వేతనాలు చెల్లింపు జరుగలేదన్నారు. ఫైనాన్స్ అధికారులు ప్రతి నెలా 5వ తేదీ నాటికి 90-95 శాతం ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామని ప్రకటిస్తున్నారని, దానిలో ఎంత మాత్రం వాస్తవం లేదని విమర్శించారు. ప్రతినెలా అందరికీ వేతనాలు చెల్లించిన తర్వాతనే ఉపాధ్యాయులకు చెల్లిస్తున్నారనే భావన సర్వత్రా నెలకొందన్నారు. దానికి తగ్గట్టుగానే ఈ నెల ఒక్క ఉపాధ్యాయునికి కూడా వేతనాలు అందలేదన్నారు. వేతనాలు ఆలస్యం వల్ల బ్యాంక్ రుణాలకు సంబంధించి ఇఎంఐలు చెల్లించలేకపోతున్నారని, దాని వలన అపరాధ రుసుంలు చెల్లించాల్సి రావడంతో పాటు, భవిష్యత్‌లో రుణాలు పొందలేని పరిస్థితి కూడా ఏర్పడుతుందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఎఫ్, ఏపిజిఎల్ఎస్ఐ, డిఎ తదితర బకాయిలు జనవరి 15 నాటికి కొంతమేర చెల్లిస్తామని డిసెంబర్‌లో నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక శాఖ అధికారులు ప్రకటించారని తెలిపారు. గడువు ముగిసి నెల రోజులు దాటినా దాని ఊసే ప్రస్తావించడం లేదని విమర్శించారు. మూడు రోజుల్లో డీఏ ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క డీఏ కూడా ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కావున ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు ఎప్పుడు ఇస్తారో ప్రకటించాలని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేపత్రం విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు సరళ, జిల్లా కార్యదర్శి ప్రమీల, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు దేవేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి : వ్యకాసం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కలకత్తాలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేద్దామని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వి.సావిత్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం 10వ ఆల్ ఇండియా మహాసభలు కలకత్తాలోని హౌరా నగరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికులు, పేదల సమస్యల పరిష్కారంపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతి ఉపాధి కూలీకి 200 రోజులు పనులు, పెరిగిన ధరలకు అనుకూలంగా రోజుకి రూ.600 కూలీ వచ్చేలా చూడాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. భూ సమస్యలు వ్యవసాయ కార్మికులకు సమగ్రమైన చట్టం తేవాలన్నారు. స్థానిక సమస్యలు విద్య వైద్యం ఉపాధి తదితర పేదల సమస్యల పరిష్కారం కోసం మహాసభల్లో చర్చించుకుని భవిష్యత్ పోరాటాలకు ప్రణాళిక రూపొందించుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, శంకర్, ఓబులేసు, జిల్లా సహాయ కార్యదర్శులు కృష్ణ నారాయణ, నిర్మల, మున్ని, జిల్లా కమిటీ సభ్యులు సుంకన్న, కరీం, శివశంకర్, చితంబరమ్మ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

సోలార్ భూ పోరాటం కేసు కొట్టివేత



కేసు కొట్టివేత అనంతరం కోర్టు బయట విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎన్‌పి కుంటలో రైతులకు పరిహారం ఇవ్వకుండా నిర్మిస్తున్న సోలార్ పవర్ పనులు ఆపాలని 2018లో సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమించినందుకు 23 మందిపై పెట్టిన కేసును కదిరి కోర్టు కొట్టివేసింది. శుక్రవారం ఈ కేసుపై కదిరి కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సిపిఎం జిల్లా కార్యదర్శులు వి.రాంభూపాల్, ఎం.ఇంతియాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, జిల్లా నాయకులు కష్ణమూర్తి, సుబ్బిరెడ్డి, నరసింహ తదితరులు ఉన్నారు. రైతుల పక్షాన న్యాయం కోసం చేసిన పోరాటాన్ని జడ్జి పరిశీలించి సామాజిక దృక్పథంతో చేసిన పోరాటం కావున కేసును కొట్టి వేయడంపై సిపిఎం హర్షం వ్యక్తం చేసింది.

'శ్రీ మేథా'లో ఘనంగా వీడ్కోలు సమావేశం



డీఎస్పీని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక సాయినగర్ లోని శ్రీ మేధా జూనియర్ కళాశాల వీడ్కోలు సమావేశాన్ని కళ్యాణదుర్గం రోడ్డులోని వాసవి డిగ్రీ కళాశాల ఆవరణంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. దిశా డిఎస్‌పి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సెల్‌ఫోన్ వినియోగంపై విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించారు. అవసరం మేరకు సెల్‌ఫోన్ ఉపయోగం జీవితానికి ఉపయోగపడుతుందని అన్నారు. అనవసర వినియోగం అనివార్యాలకు దారితీస్తుందని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పలు విషయాలను వివరించారు. మార్చి 2022లో జరిగిన పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు లిఖిత, విజయలక్ష్మి, షహతాన్ పించాకౌట్ లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల ఛైర్మన్ తలుపుల శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఏటా తమ తల్లిదండ్రుల పేరు మీద విద్యార్థులకు రూ.1,116 నగదు, జ్ఞాపకలను అందిస్తున్నట్లు తెలిపారు. సాధారణ స్థాయి విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాకవి ఏలూరు వెంకన్న, ప్రిన్సిపల్ రాధిక, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, శ్రీ వాసవి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.దామోదర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చదివిన కళాశాలను ఎప్పటికీ మరవొద్దు..

ఫుడ్ టెక్నాలజీ రంగంలో ఉపాధి అవకాశాలు అపారం
జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థుల ఉన్నతికి కారణమైన కళాశాల, పాఠశాలను, గురువులను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని, వీలున్నప్పుడు ఆయా విద్యా సంస్థలను సందర్శించాలని జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జేఎన్టీయూ అనుబంధ ఓటీపీఆర్ఐ కళాశాలలో ఫుడ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ నూతన విద్యార్థులకు స్వాగతం, 2021 విద్యా సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ఆచార్య బి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన, విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫుడ్ టెక్నాలజీ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా వున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యను అందించి మన ఉన్నతికి కారణమైన విద్యాసంస్థలను, గురువులు మరవరాదన్నారు. ప్రస్తుతం కళాశాలలో చేరిన విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యశించి ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపీనాథ్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎడి లక్ష్మీనాయక్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని దేవగిరి గ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను వ్యవసాయ శాఖ ఎడి లక్ష్మీనాయక్ శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా రైతులు ఉపయోగించిన రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వివరాలను అడిగి రైతులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు రసాయన ఎరువుల కంటే పశువుల పేడ, కోడి పెంట, గొర్రెల ఎరువును పంటలకు వాడాలన్నారు. దీంతో పంటల దిగుబడి పెరగడంతోపాటు భూమిలో సారవంతం తగ్గదన్నారు. రసాయన ఎరువులు వాడటం వల్ల ఒక సంవత్సరం మాత్రం మాత్రమే పంట దిగుబడి వస్తుందని, తర్వాత భూమి తన సహజత్వాన్ని కోల్పోతుందన్నారు. కావున రైతులందరూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులనే వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది గోపాల్, అవినాష్, వీరాంజనేయులు, శ్రీకాంత్, నరసింహులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

'శ్రీ చైతన్య' విద్యార్థి సత్తా

అనంతపురం : ఇటీవల కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో జరిగిన కెఆర్ఎస్ ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో శ్రీ చైతన్య అనంతపురం-9 బ్రాంచి విద్యార్థి వేళ్ల దీక్షిత్ ప్రతిభ కనబరచి ప్రథమ విజేతగా నిలిచాడు. శుక్రవారం విద్యార్థిని చైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాంత, డీన్ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరుసు వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

శింగనమల : శింగనమల మండల కేంద్రంలో వెలసిన మసూద్‌స్వామి ఉరుసు మహోత్సవ వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే జొన్నగడ్డ పద్మావతి అనంతపురంలోని తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆలూరు ఏర్రిస్వామి రెడ్డి, వైసిపి నాయకులు డాక్టర్ శివశంకర్ రెడ్డి, బెస్త గోపాల్, కోఆప్షన్ మెంబర్ మర్తాడు ఆలీబాషా, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

షాదీ తోఫా ఇవ్వడం హర్షణీయం

ఉరవకొండ : సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు షాదీ తోఫా ఇవ్వడం హర్షణీయమని వైసిపి స్టూడెంట్ యూనియన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, మైనార్టీ నేత ఎం.జిలాన్ బాషా అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..అక్టోబర్ 1 నుండి డిసెంబరు 2022 వరకు వివాహం చేసుకున్న ముస్లిం మైనార్టీలకు వైఎస్ఆర్ షాదీ తోఫా ద్వారా 4.536 మంది లబ్ధిదారులకు రూ.38.18 కోట్లు ఆర్థిక సాయం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.68.68 కోట్లు వివాహ ప్రోత్సాహకాలు చెల్లించకుండా ఎగ్గొట్టారని విమర్శించారు. షాదీ తోఫా అందజేసిన జగన్‌కు ముస్లిములు అండగా ఉంటారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పెద్దపప్పూరు : వరదయ్యపల్లి గ్రామంలోని 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలను శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ సిరి శుక్రవారం తనిఖీ చేశారు. నాణ్యమైనభోజనం అందిస్తున్నారా లేదా, గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లల్ని పదాలను పలికిస్తూ ఆమె అంగన్‌వాడీ టీచర్‌గా వ్యవహరించారు. పిల్లలకు అందించే పౌష్టికాహారంలో అవకతలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. పీడీ శ్రీదేవి, సిడిపిఒ శాజిదా బేగం, సూపర్‌వైజర్లు దస్తగిరమ్మ పాల్గొన్నారు.

క్విజ్ ఫెస్టివల్‌తో విద్యా నైపుణ్యం

బుక్కరాయసముద్రం : క్విజ్ ఫెస్టివల్‌తో పిల్లలలో దాగివున్న విద్యా నైపుణ్యం పెరుగుతుందని బుక్కారాయసముద్రం ఆర్‌డిటి టీం లీడర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిటి ఆఫీసులో 6 క్లస్టర్ల విద్యార్థులకు ఏరియా లెవల్ క్విజ్ ఫెస్టివల్ నిర్వహించారు. నైపుణ్యం కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వీరందరూ రీజినల్ లెవల్ క్విజ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏటీఎంలు గంగాధర్, భాస్కర్‌రెడ్డి, అనిత, సాయిలీల, తిరుపతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారు రీజన్ లెవల్లో క్విజ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

నార్పల : సిద్దరాచెర్ల గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఆజాదీకా అమృత్ సరోవర్ పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సిబ్బందితో కలిసి శుక్రవారం పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏపీవోలు ఓబన్న, లక్ష్మీకాంత బాయి, సర్పంచి సాకే రామాంజనేయులు, ఈసీ సంగీత, టెక్నికల్ అసిస్టెంట్ హరికుమారరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ దామోదర్, వార్డు మెంబర్లు సావిత్రమ్మ, శ్రీనివాసులు, కూలీలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

పుట్లూరు : వచ్చే నెలలో గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను తహశీల్దార్ సుమతి, ఎంపీడీవో యోగానందరెడ్డి, ఎస్ఐ వెంకటప్రసాద్, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, బాత్‌రూముల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా 836 గ్రాడ్యుయేట్ ఓటర్లు , 19 టీచర్స్ ఓట్లు ఉన్నట్లు తహశీల్దారు సుమతి తెలిపారు.

బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

పుట్లూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి జరిగిన తీవ్ర అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఎ.కొండాపురం గ్రామీణ బ్యాంకు వద్ద ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సి.పెద్దిరాజు, చేతి వృత్తిదారుల సమాఖ్య మండల అధ్యక్షుడు ఓబుళపతి, రైతు సంఘం నాయకులు పెద్ద కొండయ్య, బాలకొండయ్య, ఓబులేసు, విజయ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల బంద్ విజయవంతం



అనంతపురంలో బంద్‌లో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు



గుంతకల్లులో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, కొన్ని రోజుల క్రితం నారాయణ కళాశాలలో జరిగిన విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనకు నారాయణ కళాశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపుతో చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతంగా ముగిసింది. శుక్రవారం అనంతపురంలోని కార్పొరేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా విద్యార్థులకు సెలువులు ఇచ్చి మూసివేశారు. కొన్ని విద్యా సంస్థలను విద్యార్థి సంఘాల నాయకులు మూసివేయించారు. ఈ క్రమంలో విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయి స్వామి, చిరంజీవి, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్, ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల దోపిడీ ఒక మాఫియా రూపంలో జరుగుతోందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేర్లతో విద్యాసంస్థల యాజమాన్యలు వేధిస్తున్నాయని తెలిపారు. నారాయణ కళాశాల విద్యార్థిని భవ్యశ్రీ ఫీజు కట్టలేదని వేధించడంతో కళాశాలపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నియంత్రించాల్సిన విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. యజమాన్యానికి సహకరిస్తున్న ఆర్ఐఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, కిరణ్, చంద్ర, ఆదర్శ, ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి రమణయ్య, నాయకులు ఉమామహేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ కళాశాలను సీజ్ చేయాల్సిందే

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ, ఫీజులు చెల్లించని విద్యార్థులను వేధింపులకు గురిచేస్తూ ఆత్మహత్యలకు కారణమవుతున్న నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలని ఎఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి పృధ్వీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఐఎస్‌బి ఆధ్వర్యంలో కలెక్టరేట్ 48 గంటల దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు విద్యార్థి సంఘాల నాయకులు పరమేష్, సురేష్, రాఘవేంద్రలు మద్దతుగా హాజరయ్యారు. నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలని కోరారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారకులైన డిజిఎం వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌బి నాయకులు విష్ణు, మారుతి, శంకర్, విజయ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. జిల్లాలో కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల ఫీజుల వేధింపులను అరికట్టాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతం అయింది. బంద్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. రమేష్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి తక్షణమే నారాయణ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, కిషోర్, చందు, జాకీర్, జాక్, రాబర్ట్, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

విద్యార్థుల ఆత్మహత్యకు కారణమవుతున్న నారాయణ విద్యా సంస్థల యాజ మాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐద్వా మహిళా సంఘం కార్యదర్శి జ్యోతి, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి కసాపురం రమేష్ డిమాండ్ చేశారు. నారాయణ విద్యా సంస్థల సిబ్బంది వేదింపులు తాళలేక భవ్యశ్రీ ఆత్మహత్యాయత్నాన్ని నిరసిస్తూ స్థానిక హంపిరెడ్డి భవనం ఎదుట కూడలిలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఫీజుల వసూళ్లతో విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి కసాపురం రమేష్, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు రంగమ్మ, మహిళలు పాల్గొన్నారు.

ఉరవకొండ : కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ తలపెట్టిన బంద్ విజయవంతం అయినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిద్దార్థ పేర్కొన్నారు. పోలీసులు నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. 41 సిఆర్‌పి కింద నోటీసు ఇచ్చారు. సిద్దార్థతో పాటు ఎంఎస్‌యువై రాష్ట్ర నాయకులు రేగాటి శివకృష్ణను అరెస్టుచేసి వజ్రకరూర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

రాయదుర్గం : నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను పోలీసులు భగ్నం చేశారు. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ తదితర సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఆయా సంఘాల నాయకులు పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల బంద్ చేసేందుకు పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముందుగా రాయదుర్గం విద్యార్థి యువజన సంఘాల నాయకులు రాయదుర్గంలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలను బంద్ చేసి విద్యారణ్య జూనియర్ కళాశాలకు చేరుకోవడంతో అక్కడ పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు అంజి, రాజు, ఎఐవైఎఫ్ తాలూకా ప్రధాన కార్యదర్శి కోట్రెష్ మాట్లాడుతూ ప్రభుత్వం పోలీసుల చేత ఉద్యమాలని అణిచివేసేందుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. వెంటనే నారాయణ కళాశాలపై కేసు నమోదు చేసి ఫీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేయడానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎఐఎస్ఎఫ్ తాలుకా ఆర్గనైజింగ్ కార్యదర్శి వంశీ, ఎఐఎస్ఎఫ్ నాయకులు సింహాద్రి, మంజు అరుణ్, సంతోష్, ఎఐవైఎఫ్ నాయకులు తరుణ్, స్వామి, మంజు, రామ్, తదితరులు పాల్గొన్నారు.



వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు



అనంతలో నిరసన దీక్షలో ఎఐఎస్‌బి విద్యార్థి సంఘం నాయకులు

ఆర్ట్స్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

ప్రిన్సిపల్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్ట్స్ కళాశాల ఎన్‌సిసి విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి కొనియాడారు. ఎన్‌సిసి పురుషుల విభాగం నుండి క్యాడెట్ వీరనారాయణ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని కళాశాలకు విచ్చేసిన సందర్భంగా శుక్రవారం ఆయనకు ఘన స్వాగతం పలికారు. నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల డ్రామా హాలులో వీరనారాయణకు సన్మానం చేశరు. ఈ సందర్భంగా క్యాడెట్స్‌ను ఉద్దేశించి ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీ వీధుల్లో రాష్ట్రపతి సమక్షంలో కవాతులో పాల్గొని రావడం కళాశాలకు గర్వకారణం అని కొనియాడారు. క్యాడెట్స్ అందరూ కష్టపడి పనిచేస్తూ నైపుణ్యాలను పెంపొందించుకుంటూ దేశ సేవలో పాల్గొనడానికి ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ రంగనాథ్ మాట్లాడుతూ అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సాయ శక్తులా పనిచేయాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు, ఇతర జాతీయ శిబిరాలలో విరివిగా పాల్గొనే విధంగా కళాశాల క్యాడెట్స్‌కి శిక్షణ ఇస్తున్నామన్నారు. దీని ప్రతిఫలమే ఐదేళ్లుగా క్రమం తప్పకుండా ఢిల్లీలో జరుగు జాతీయ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మన కళాశాల క్యాడెట్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్, జబీవుల్లా, శేషారెడ్డి, జయలక్ష్మి, హేమమాలిని, విద్యార్థులు పాల్గొన్నారు.

'ట్రెల్లిస్'లో ఉత్సాహంగా క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం



పావురాన్ని ఎగురవేసి క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం

నగరంలోని ది ట్రెల్లిస్ పాఠశాల వార్షిక క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జీసస్ నగర్‌లోని ట్రెల్లిస్ పాఠశాల మైదానంలో జరిగిన కార్యక్రమానికి స్కూల్ ఫౌండర్, ఛైర్మన్ శ్రీకాంత్ వడ్ల, అధ్యక్షుడు వెంకట సిరిదీప్, కోశాధికారి నందిని బేడిగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 700 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. మార్చ్ పాస్ట్, టార్చ్ బేరర్ రన్ నిర్వహించారు. ఫ్లవర్ డ్రిల్, డంబెల్ డ్రిల్, హూప్స్ డ్రిల్, సెలంబం, యోగా, మ్యూజిక్, ఫీల్డ్ ప్రదర్శనలు ఆహూతులను ఉర్రూతలూగించాయి. ఈ సందర్భంగా స్కూల్ ఛైర్మన్ శ్రీకాంత్ వడ్ల మాట్లాడుతూ.. విద్యలో క్రీడలూ చాలా ముఖ్యమైన భాగమన్నారు. విద్యార్థులు చిత్తశుద్ధితో క్రీడల్లో పాల్గొనాలని కోరారు. అధ్యక్షుడు వెంకట సిరిదీప్ మాట్లాడుతూ..క్రీడా దినోత్సవం అనేది జీవిత పోటీకి విద్యార్థులను సిద్ధం చేయడానికి అభ్యాస అనుభవం పై చేయి అని పేర్కొన్నారు. అనంతరం వివిధ క్రీడా విభాగాల్లో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు అధ్యక్షులు అబ్దుల్‌జిలాన్

ప్రగతి పథంలో గుత్తి పట్టణ బ్యాంకు

టౌన్ బ్యాంక్ అధ్యక్షులు ఎస్.అబ్దుల్ జిలాన్

ప్రజాశక్తి-గుత్తి

ప్రగతి పథంలో పట్టణ బ్యాంకు పయనిస్తోందని ఆ బ్యాంకు అధ్యక్షులు ఎస్.అబ్దుల్ జిలాన్ పేర్కొన్నారు. గుత్తి ఆర్ఎస్‌లోని ది గుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్ ఆర్ఎస్ శాఖలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ బ్యాంక్ అధ్యక్షులు అబ్దుల్ జిలాన్, సీఈవో ఎస్.మహేశ్వర ప్రసాద్ లు మాట్లాడుతూ ది గుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్ అధ్యక్షులుగా తిరుమలప్ప, కార్యదర్శిగా రంగనాథ్ అయ్యన్ 1923లో బ్యాంకు ఏర్పాటయిందన్నారు. వ్యాపారులకు చిన్నపాటి రుణాలు ఇవ్వడంతోపాటు చేనేత వర్గాల కోసం నూలు అలాగే సైకిళ్ల కొనుగోలు కోసం రుణాలు మంజూరు చేసేవారన్నారు. 1968లో బ్యాంకు మూతపడిందన్నారు. 1975లో న్యాయవాది శివరావు అధ్యక్షతన పాల్గవర్గం ఏర్పాటై బ్యాంకును పునరుద్ధరించారన్నారు. 1978లో రైల్వే కార్మికుల కోసం గుత్తి ఆర్ఎస్‌లో శాఖను ప్రారంభించారన్నారు. బ్యాంకులో రైల్వే కార్మికులను సభ్యులుగా చేర్చుకొని వారికి రుణాలిస్తూ బ్యాంకు నిర్వహణ కొనసాగిందన్నారు. బ్యాంకులో చిట్‌ఫండ్ వ్యాపారం కూడా నిర్వహించారన్నారు. 2007లో రిజర్వ్ బ్యాంక్ నుంచి గుత్తి టౌన్ బ్యాంకుకు లైసెన్స్ లభించిందన్నారు. తమ బ్యాంకులో రూ.95 కోట్లు డిపాజిట్లు ఉండగా రూ.81 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. రూ.176 కోట్ల వ్యాపారం నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ఏడాదిలో రూ.2.50 కోట్లు బ్యాంకుకు లాభాలు వచ్చాయన్నారు. తమ బ్యాంకులో కంప్యూటరీకరణ చేశామన్నారు. ఎన్ఎఫ్‌టి సౌకర్యం ఉందన్నారు. త్వరలో ఏటీఎం సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. 2018లో రూ.2 కోట్లు వ్యయం చేసి గుత్తి ఆర్ఎస్ శాఖకు సొంత భవనం నిర్మించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు పట్టణ బ్యాంకు ఉండగా గుత్తి టౌన్ బ్యాంకు ప్రథమ స్థానంలో ఉందన్నారు. సభ్యులు ఖాతాదారుల సహకారంతో బ్యాంకు వంద వసంతాల మనుగడ పటిష్టంగా ఉందన్నారు. ఈనెల 12వ తేదీన తమ బ్యాంకు శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు చెప్పారు. స్పందన ఫంక్షన్ హాల్‌లో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. సభ్యులు ఖాతాదారులు శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడు ఎం.కృష్ణ, డైరెక్టర్లు కె.నాగరాజు, డి.వెంకటేష్, సి.నాగరాజు, జక్కా వీరన్న, కె.మధుసూదన్ గుప్తా, ఎ.మహబూబ్, జి.వెంకటేష్, డి.దాదా తదితరులు పాల్గొన్నారు.

మసీదుల అభివృద్ధికి రూ.11 లక్షలు విరాళం

అనంతపురం : అనంతపురం కళ్యాణదుర్గం రోడ్డు విద్యారణ్య నగర్ లోని ఫాతిమా మసీదు, తారా మసీదు అభివృద్ధికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన సొంత నిధులను శుక్రవారం విరాళంగా ప్రకటించారు. ఎమ్మెల్యే ఆయా మసీదులకు స్వయంగా వెళ్లి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఫాతిమా మసీదుకు రూ.5 లక్షలు, తారా మసీదుకు రూ.6 లక్షలు విరాళంగా అందజేశారు. ప్రభుత్వం నుంచి మసీదుల అభివృద్ధికి సాయమందేలా చర్యలు తీసుకుంటానన్నారు. భవిష్యత్తులోనూ తనవంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాల్తూరు వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ : పాల్తూరు వైద్యాధికారి అరుణ కుమారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా? కలెక్టర్‌కు ఫిర్యాదు చేయమంటారా అని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి భీమిరెడ్డి డిఎంఅండ్‌హెచ్ఒపై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పాల్తూరు ఆరోగ్య కేంద్రాన్ని సర్పంచి బ్యులారాణి రాజశేఖర్ తో కలిసి ఎంపిపి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. హాజరు పట్టికలో వైద్యాధికారి సంతకాలు కూడా చేయకపోవడంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి సరిగా విధులకు రావడంలేదని స్థానికులు ఎంపీపీకి ఫిర్యాదు చేశారు. రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తోందని తెలిపారు. వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపిపి ఫోన్‌లో డిఎంహెచ్ఒతో మాట్లాడారు. వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే కలెక్టరు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. వైసిపి రాష్ట్ర నాయకులు కరణం భీమ్‌రెడ్డి, స్థానిక నాయకులు రాజశేఖర్, వెంకటేశులు, షణ్ముఖ గౌడ్, నాగరాజు హేమంత్, హంపయ్య పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు

ఏపీ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో మీకెంత? నాకెంత? మనవాడికెంత? పద్ధతిలో పనులు, పథకాలు, పదవుల పంపకాలు జరిగేవని, జగనన్న పాలనలో నీ, నా అనే భేదం లేకుండా, కులమతాలకు తావులేకుండా, పార్టీల వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఏపీ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. శుక్రవారం పుట్లూరు మండల కేంద్రంలో సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో జగనన్న చెప్పిందే చేస్తున్నారన్నారు. మీ భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సిఎంగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎంపీపీ భూమిరెడ్డి గారి రాఘవరెడ్డి, సర్పంచులు కె.రామకృష్ణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఓబులేసు, వైసిపి నాయకులు శ్రీధర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు..

భార్యను కత్తితో పొడిచి చంపిన భర్త

ప్రజాశక్తి-ఆత్మకూరు

భార్య అక్రమ సంబంధాన్ని కళ్లారా చూసిన భర్త ఆగ్రహంతో ఆమెను కత్తితో పొడిచి చంపిన సంఘటన ఆత్మకూరు మండలం పడమటి యాలేరు పంచాయతీ వై.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..ఆత్మకూరు మండలం పడమటి యాలేరు పంచాయతీ వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన బోయ నరేంద్ర (38), ఉరవకొండ మండలం రాసపల్లి గ్రామానికి చెందిన తలారి హేమలత (31)కు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వారి కాపురం సజావుగానే కొనసాగింది. ఇటీవల కొన్నేళ్లు గా హేమలత అదే కులానికి చెందిన మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. దీనిపై భర్త పలుమార్లు భార్య హేమలతను హెచ్చరిస్తూ వచ్చాడు. ఇటీవల హేమలత ప్రవర్తనతో నరేంద్ర మరింత విసుగు చెందాడు. శుక్రవారం తెల్లవారుజామున నరేంద్ర పొలానికి నీళ్లు పెట్టేందుకు తోటకు వెళ్లాడు. అనంతరం పనిచేసే పరికరాల కోసం తిరిగి ఇంటికి వచ్చాడు. భార్య మరో వ్యక్తితో కలిసి ఉండడాన్ని కళ్లారా చూశాడు. ఆగ్రహించిన నరేంద్ర ఇంట్లోని కత్తి తీసుకుని భార్య హేమలతను కసితీరా పొడిచాడు. తీవ్ర గాయాలతో హేమలత అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. అనంతరం నరేంద్ర తన భార్యను తానే చంపినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో ఉన్న నరేంద్రను ఆత్మకూరు సిఐ మోహన్, ఎస్ఐ రంగుడు యాదవ్ అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్యను చంపి భర్త జైలుకెళ్లడంతో వారి పిల్లలు క్రాంతి కుమార్ (11), స్వీటీ (10) అనాథలయ్యారు. చిన్నారుల పరిస్థితి అందరి హృదయాలను కలచివేసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల పరిధిలోని అనిమిరెడ్డిపల్లి గ్రామ సమీపాన శుక్రవారం కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు కుందుర్పి మండలం కదరంపల్లి గ్రామానికి చెందిన ప్రతాప్ సొంత పనుల నిమిత్తం కారులో అనంతరం వెళ్లాడు. పనులు ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. అనిమిరెడ్డిపల్లి సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రతాప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు బంధువులకు సమాచారం అందించి చికిత్స కోసం అతన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విషపు నీరు తాగి మూగజీవాలు మృతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని తిప్పయ్యదొడ్డి గ్రామంలో గొల్ల కెంచప్పకు చెందిన 5 మేకలు, 8 గొర్రెలు మృతిచెందాయి. బాధితుడు, పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తిప్పయ్యదొడ్డికి చెందిన కెంచప్ప రోజూ మాదిరిగానే గొర్రెల మందను మేపునకు తీసుకెళ్లాడు. ఈనేపథ్యంలో ఓ రైతు పొలంలో క్రిమిసంహారక మందు కలిపిన నీటిని తాగి 5 మేకలు, 8 గొర్రెలు మృతిచెందాడు. దీంతో కెంచప్ప లబోదిబోమంటూ పశువైద్యాధికారికి సమాచారం అందించాడు. దీంతో ఆయన చేరుకుని మృతిచెందిన మూగజీవాలకు పోస్టుమార్టం నిర్వహించారు. వీటి విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుందని తెలిపారు.

అగ్నికి పశుగ్రాసం దగ్ధం

గుత్తి : మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో ఓ రైతుకు చెందిన పశుగ్రాసం శుక్రవారం అగ్నికి ఆహుతి అయింది. గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి అనే రైతు రెండు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని వాముదొడ్డిలో నిలువ చేశారు. అయితే ప్రమాదవశాత్తు వాముదొడ్డికి నిప్పు అంటుకుంది. మంటలకు పశుగ్రాసం దగ్ధమయింది. స్థానిక పోలీసుల సమాచారం మేరకు గుంతకల్లు నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. రూ.20 వేలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

పప్పుశనగను రూ.6 వేలతో కొనుగోలు చేయాలి

బెలుగుప్ప : రైతులు పండించిన పప్పుశనగను క్వింటాల్ రూ.6 వేలతో కొనుగోలు చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి హెచ్ రాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో 1.90 లక్షల ఎకరాల్లో రైతులు పప్పుశెనగ పంటను పండించారన్నారు. ఈ సంవత్సరం పప్పుశెనగ దిగుబడి ఆశాజనకంగా వున్నప్పటికీ ధర మాత్రం గిట్టుబాటుగా లేదన్నారు. కూలి రేట్లు, పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయన్నారు. ఈ పరిస్థితుల్లో పప్పుశెనగ క్వింటా ధర రూ.6 వేలుగా నిర్ణయిస్తే రైతులకు కొంత మేరకైనా ఊరట కలుగుతుందన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో దళారీలు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. గత సంవత్సరం ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించండి

ఉపాధి కూలీలకు బకాయి బిల్లులు చెల్లించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి హెచ్.అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేశులు డిమాండ్ చేశారు. ఉపాధి పనులు లేక కూలీలు బతుకుతెరువు కోసం వలసలు పోయే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు కూలీలకు ఉపాధి పనులు కల్పించేలా చూడాలన్నారు.

బాక్స్ ఎన్ డిపోను తనిఖీ చేసిన డిఆర్ఎం

గుత్తి : రైల్వే బాక్స్ ఎన్ డిపోను గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ వెంకటరమణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలోని రికార్డులను పరిశీలించారు. గూడ్స్ బాక్సుల మరమ్మతుల మెటీరియల్ నిల్వలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సి అండ్ డబ్ల్యు సీనియర్ డిఎంఇ పుష్పరాజ్, డిఎంఇ అఖిల్ పాలేవార్, ఎస్ఎస్ఇ మనోహర్‌బాబు రాంభూపాల్‌రెడ్డి, ధన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడిని పరామర్శించిన జెసి.ప్రభాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు : రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ స్థానిక బీసీ కాలనీకి చెందిన టిడిపి నాయకుడు మహబూబ్‌బాషాను తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం చేయడానికి ఆసుపత్రి వర్గాలతో జెసి చర్చించారు. ఆయన వెంట టిడిపి నాయకులు కేశవరెడ్డి, గంగరాజు, బాలిరెడ్డి, చిరంజీవులు, హరికృష్ణారావు, రవిశేఖరరెడ్డి నాగేశ్వరరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

శింగనమల పిహెచ్‌సిలో 108 కు.ని. ఆపరేషన్లు

శింగనమల : మండల ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించాలని సింగిల్ విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామ్‌రెడ్డి కోరారు. శింగనమల మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 108 క్యూబెక్టమి ఆపరేషన్లు పూర్తి చేసిన సందర్భంగా శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. ముఖ్య అతిథిగా బొమ్మన శ్రీరామ్‌రెడ్డి హాజరై సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం మెడికల్ సర్జన్ డాక్టర్ రమణ నాయక్ మాట్లాడుతూ తాను సిహెచ్‌సిలో బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలల్లో 108 ఆపరేషన్లు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగికీ మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రుణాలు మాఫీచేయాలని వినతి

పెద్దవడుగూరు : వ్యవసాయానికి రైతులు తీసుకున్న రుణాలను బ్యాంకులు మాఫీ చేయాలని సీపీఐ మండల నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బ్యాంకు అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజరు అమరేశ్వరరెడ్డిని కలిసిన సీపీఐ మండల నాయకులు నారాయణ, వెంకటరాముడు యాదవ్, మాజీ చెన్నకేశవ దేవదాయ శాఖ ఛైర్మన్ లింగన్న, నాయకులు సూధకర గౌడు, రామయ్య, ఆదినారాయణ యాదవ్, నాగరాజు వినతి చేశారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా రైతులు సాగుచేసిన పంటలు పండక తీవ్రంగా నష్టపోయారన్నారు. రుణాలు కట్టడానికి రైతుల వద్ద చిల్లిగవ్వలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మేనేజరు అమరేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు.